మావో చూపిన మార్గమే

విప్లవకారులకు శిరోధార్యం

ముషీరాబాద్: విద్యానగర్‌లోని సీపీ భవనంలో న్యూ డెమొక్రసీ ఆధ్వర్యంలో సోమవారం మావో వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాధినేని వెంకటేశ్వర్‌రావు మావో చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కమ్యూనిస్టు విప్లవకారులకు మావో చూపిన మార్గమే శిరోధార్యమని అన్నారు. రాష్ట్ర నాయకుడు గోవర్ధన్ మాట్లాడుతూ... విప్లవ కమ్యూనిస్టు సంస్థలు ఇప్పటికైనా ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వి.సంధ్య, ఎం.శ్రీనివాస్, అనురాధా, ఎం.పరశురామ్, శివబాబు, రియాజ్, నాగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మావో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న న్యూ డెమొక్రసీ నాయకులు

రాసిన సాహిత్యం పరిమితం..

రగిలించిన పోరాట స్ఫూర్తి అపరిమితం

ఘనంగా కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు

చిక్కడపల్లి: కాళోజీ నారాయణరావు కవితలు వాడుక భాషలో ఉంటాయనడానికి కారణం ఆయన ప్రజల పక్షం వహించి ఉద్యమించారని వక్తలు పేర్కొన్నారు. త్యాగరాయ గానసభలో సోమవారం 'ధిక్కార స్వరం'కాళోజీ నారాయణరావు జయంతి నిర్వహించారు. ప్రధాన వక్తగా ప్రముఖ కాలమిస్ట్ జయసూర్య మాట్లాడుతూ... తాను రాసిన సాహిత్యం పరిమితమే అయిన అపరిమిత పోరాట స్ఫూర్తి రగిలించారని అన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న కాళోజీ తెలంగాణ ఏర్పాటుకు అంతే స్ఫూర్తితో ఉద్యమించి కార్యక్షేత్రంలో నిలిచిన యోధుడని కొనియాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రాంతలకు అతీతంగా తెలుగు వారి ఖ్యాతిని నిలిపిన మహనీయులతో పాటు దేశ మహోన్నతులను స్మరిస్తూ ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర చేస్తున్నామని తెలిపారు. పత్రిక రచయిత సాయికుమార్‌రెడ్డి, కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యులు ఎస్‌బీ రామ్ పాల్గొని కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు.



కాళోజీ జయంతి వేడుకలో జయసూర్య, కళా జనార్ధనమూర్తి, సాయికుమార్‌రెడ్డి, ఎస్‌బీ రామ్

థియేటర్ కార్మికులకు మూడేళ్లుగా

పీఎఫ్ చెల్లించడం లేదు

చిక్కడపల్లి: సినిమా థియేటర్లలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ థియేటర్స్ ఎంప్లాయీస్ యూనియన్(టీటీఈయూ) అధ్యక్షుడు ఎస్.మారన్న, ప్రధాన కార్యదర్శి కె.అరుణ్ సోమవారం కార్మికశాఖ కమిషనర్ కృష్ణఆదిత్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... మూవీ టైమ్స్ సినిమా థియేటర్ సంస్థ ఆధ్వర్యంలో అమీర్‌పేట్, గచ్చిబౌలిలలోని థియేటర్ల కార్మికులకు మూడేళ్లుగా పీఎఫ్ చెల్లించడం లేదన్నారు. ఈ థియేటర్లలో సుమారు 300 మంది కార్మికులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. యూనియన్‌లో చేరిన వారిని అకారణంగా తొలగిస్తున్నారని వారు ఆరోపించారు. కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్న మూవీటైమ్స్ సంస్థ చర్యలు చేపట్టాలని కోరారు.



కార్మికశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీటీఈయూ అధ్యక్షుడు మారన్న, ప్రధాన కార్యదర్శి అరుణ్

ఆల్ఫా సర్కిల్ లోగో ఆవిష్కరణ

కాచిగూడ: ఏ రంగంలోనైనా విజయాన్ని అంది పుచ్చుకోవాలంటే ఆత్మ విశ్వాసమే తొలిమెట్టు అని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం మంత్రి తన చాంబర్‌లో ఆల్ఫా సర్కిల్ సంస్థ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వ్యాపారులను ప్రోత్సహించేలా మడిపడిగె రాజు చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి రంగాలను ఎంచుకోవడం అభినందనీయమని అన్నారు. ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ఈనెల 27వ తేదీన సంస్థ ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు మడిపడిగె రాజు తెలిపారు.

'రాజకీయాలకు అతీతంగా హైడ్రా వ్యవహరించాలి'

ముషీరాబాద్: చెరువులు, కుంటలు, వాగులు ఉన్న ప్రాంతాన్ని ఆక్రమిస్తూ అనేక మంది బడాబాబులు మాయం చేశారని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. హైదరాబాద్‌లో జయభేరి రామేశ్వర్‌రావు, రాజ్‌పుష్పా మొదలుకొని అనేక మంది బడా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములు, కాలువలు, కుంటలను కబ్జా చేశారని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాను మాస్‌లైన్ స్వాగతిస్తుందన్నారు. అయితే రాజకీయాలకు అతీతంగా.. అవినీతి వ్యతిరేకంగా హైడ్రా వ్యవహరించాలన్నారు. బడా బాబుల ఆక్రమణలను స్వాధీనం చేసుకోవాలన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రత్యామ్నాయం చూపిన తర్వాతనే ఆక్రమణలను తొలగించాలని కోరారు.

ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి



సమావేశంలో మాట్లాడుతున్న సుల్తాన్ యాదగిరి

కాచిగూడ: తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమ నేత ప్రఫుల్ రాంరెడ్డి అధ్యక్షతన సోమవారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక ఉద్యమకారులకు రూ.30వేల పెన్షన్, ఉచిత బపాస్, రూ.20లక్షల ఆరోగ్య బీమా, వంద ఎకరాల్లో ఉద్యమకారుల స్మృతివనం ఏర్పాటు చేయాలని కోరారు. వ్యాపారం చేసుకోవడానికి రూ.ఒక కోటి వరకు సబ్సిడీ రుణం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరద బాధితులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు శ్రీనివాస్‌యాదవ్, ప్రజ్యోతి కుమార్, బత్తుల సోమన్న, రాములు, చంద్రన్న, ప్రసాద్, సాయిలు, బి.రాంగారెడ్డి, గంటి చంద్రుడు, మల్లేష్, ఆర్.యాదగిరి, సుదర్శన్‌యాదవ్, చంద్రభాను, డప్పుస్వామి, కొండస్వామి, సుజి, స్వరూప, బి.లక్ష్మీ, సంతోష, వి.అరుణ, బాలస్వామి, వేణుగోపాల్‌రావు, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 3న పోపూరి శంకర శర్మ జయంతి

నల్లకుంట: ప్రముఖ సంగీత విద్వాంసుడు, శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం వ్యవస్థాపకుడు దివంగత పోపూరి శంకరశర్మ 103వ జయంతిని అక్టోబర్ 3వ తేదీన నిర్వహించనున్నట్లు సంగీత విద్యాలయం సంగీతం అధ్యాపకులు యశస్విని, తేజస్విని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సంగీత విద్వాంసులకు ఆత్మీయ సత్కారం ఉంటుందన్నారు. అనంతరం పంచశత వీణా గాణరత్న పోపూరి శ్రీనివాస శర్మచే అమ్మవారి కీర్తనల గానం ఉంటుందని చెప్పారు.

అభినందనలు



బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు అభినందులు తెలుపుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్‌గా నిరంజన్‌ను, సభ్యులుగా బాలలక్ష్మిగౌడ్, రాపోలు జయప్రకాష్, సురేందర్‌ను నియమించడం హర్షణీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ సమితి చైర్మన్ బాలరాజ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్, మణిమంజరితో కలసి ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో బీసీ జనాభా 56 శాతం ఉందన్నారు. కుల గణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు కృషి



అంబర్‌పేట మున్సిపాల్ గ్రౌండ్‌లో చెత్త సేకరణ పరికరాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: నియోజకవర్గంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సోమవారం అంబర్‌పేట మున్సిపాల్ గ్రౌండ్‌లో చెత్త సేకరించి పరికరాలను పారిశుద్ధ్య కార్మికలకు అందించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి పారిశుద్ధ్య కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లపై చెత్త లేకుండా పారిశుద్ధ్య కార్మికులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దశలవారీగా బహిరంగ చెత్త డంపింగ్ కేంద్రాలను నియోజవర్గంలో ఎత్తివేస్తామన్నారు. మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ ఉంటేనే ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ మారూతీదివాకర్, ఏఎంహెచ్‌వో డా. హేమాలత, యూసీడీ అధికారి రజిత, ఎస్ఎఫ్ఏలు అదిన్, శ్రీనివాస్ ఇతర సిబ్బంది ఉన్నారు.

ఈఎస్ఐలో మందుల కొరతను నివారించండి



ఈఎస్ఐ రాష్ట్ర వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ముషీరాబాద్: ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో తీవ్రమైన మందుల కొరత ఉందని దీనిని వెంటనే నివారించాలని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఈఎస్ఐ రాష్ట్ర వైద్యాధికారి డా. అనితను కలిసి మెమోరాండమ్ సమర్పించారు. ఈఎస్ఐ డిస్పెన్సరీల్లో వైద్య పరీక్షలు కూడా నిర్వహించడం లేదన్నారు. వెంటనే వీటిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పేరుకుపోతున్నా పట్టించుకోరా.?



అరుంధతినగర్‌లో చెత్తచెదారం పక్కనే ఆడుకుంటున్న చిన్నారులు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతినగర్‌లో చెత్తచెదారం పేరుకుపోయింది. అసలే సీజనల్ వ్యాధులు విజృంభిస్తుంటే చెత్తాచెదారం తొలగించకుండా పారిశుద్ధ్య కార్మికులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో దోమలు బెడద పెరిగిపోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అల్పాహారం పంపిణీ

నల్లకుంట: మయూరి సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో నల్లకుంట మయూరి లేన్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద సోమవారం ఉదయం బాటసారులకు నిత్య అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండపం నిర్వాహకులు రామ్ జగదీష్ ముదిరాజ్, పవన్, కృతి మనిక్కర్, అభిషేక్, రాఘవేందర్ పాల్గొన్నారు.



మయూరి సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

రేపు అభ్యుదయ ఆదర్శ దంపతుల పురస్కారం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కులాంతర, మతాంతర వివాహ దంపతులకు అభ్యుదయ ఆదర్శ దంపతుల పురస్కారం, ప్రొత్సహించిన తల్లిదండ్రులకు గౌరవ సత్కారాన్ని జరుపుతున్నట్లు కుల నిర్మూలన సంఘం తెలిపింది.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు డాక్టర్ సూర్యనారాయణ మాస్టర్, సుర్యసుధా, ప్రముఖ కొరియోగ్రాఫర్ సూర్యతేజు సుబ్రాంత్ మాస్టర్ మాట్లాడుతూ.. ఆదర్శ వివాహం చేసుకుని 40ఏళ్ల వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న నేపథ్యంలో ఈ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 11వ తేదీ సాయంత్రం 6గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య పాల్గొంటారని తెలిపారు.

ముషీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి



గౌతమ్ పాఠశాల సమీపంలో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని గౌతమ్ పాఠశాల సమీపంలో రూ.21లక్షల నిధులతో నూతన డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను చేపట్టారు. ఈ పనులను సోమవారం ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ పావని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని అన్నారు. వాటర్‌వార్క్స్ ఎండీ సుదర్శన్‌రెడ్డిని కలిసి పలుమార్లు వినతిపత్రాన్ని అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం కార్తీక్ రెడ్డి, మేనేజర్‌లు శ్రీధర్, కృష్ణమోహన్, నాయకులు ఎ.వినయ్‌కుమార్, ముఠాజైసింహ, రాకేష్, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



కాచిగూడ: రైలు కింద పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శివరాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి(50) రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు.రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనులకు 12శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



సేవాలాల్ సేనా జెండా ఆవిష్కరిస్తున్న సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీ మేరకు గిరిజనులకు రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలని సేవాలాల్ సేన తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సేవాలాల్ సేన రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో సేవాలాల్ సేన 10వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. సంజీవ్‌నాయక్ సేవాలాల్ సేన జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ.. సేవాలాల్ సేన పదేళ్లుగా లంబాడీ సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. ఈ పదేళ్లలో తండాలను ప్రత్యేక పంచాయతీలుగా సాధించామన్నారు. గిరిజన విద్యార్థులకు ప్రైవేటు కళాశాలలో స్కాలర్‌షిప్ రాలేదని సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే విద్యార్థులకు సర్టిఫికెట్లను ఇవ్వాలన్నారు. ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని, గిరిజన ఔత్సాహిక పారిశ్రామవేత్తలకు పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు బావోత్ హుస్సేన్‌నాయక్, రాజేష్‌నాయక్, కొర్ర శ్రీనునాయక్, భాస్కర్‌నాయక్, గ్రేటర్ అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్, హోభా నాయక్, నవీన్‌నాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియాలో భాషా దినోత్సవం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళ కాలేజీలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సోమవారం తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సైఫాబాద్ పీజీ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.లక్ష్మన్‌నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలగించి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, ప్రిన్సిపల్ దేవీ జోసెఫ్, మంజరి తదితరులు పాల్గొన్నారు.

బాలలక్ష్మికి అభినందనలు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులుగా నియమితులైన తెలంగాణ ఉద్యమ నాయకురాలు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత, ఓయూ విద్యార్థిని బాలలక్ష్మీకి అభినందనలు తెలిపారు. సోమవారం బాలలక్ష్మి కార్యాలయానికి వెళ్లిన ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు బొమ్మ హనుమంతు, డాక్టర్, దేశగాని సాంబశివగౌడ్ బాలకృష్ణ తదితరులు పుష్పగుచ్ఛాన్ని అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

గణపతి బప్ప మోరియా!

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. వాడవాడల్లో ఏర్పాటు చేసిన మండపాలలో గణనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. మండప నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు మండపాల వద్దకు వెళ్లి గణనాథులను దర్శించుకుంటున్నారు.
– ముషీరాబాద్/అంబర్‌పేట

వాడవాడలా పూజలందుకుంటున్న గణనాథుడు













భక్తిశ్రద్ధలతో లక్ష్మీగణపతికి పూజలు

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో సోమవారం ఉదయం సుప్రభాతం, బిందెతీర్థం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, స్వర్ణపుష్పారచన బ్రహ్మశ్రీ కాసుల రాధాకృష్ణశర్మ ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం లక్ష్మీగణపతి స్వామివారికి బిల్వార్చన చేసి గంధంతో అలంకరించారు. అనంతరం మహిళా భక్త బృందం హనుమాన్ చాలీసా, విష్ణు, లలితా సహస్ర నామార్చన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ పి.లక్ష్మారెడ్డి, అర్చకులు కాశీనాథ శర్మ, భవనందశర్మ, గోపాలాచారి, బుచ్చమ్మ చారి, జగన్‌మోహనాచారి, రామాచారి, నరసింహమూర్తి, మాజీ చైర్మన్ బీఎస్.శ్రీనివాస్‌రావు, భక్త బృందం సభ్యులు మణి, గజానంద్, రమణమూర్తి, రమణ, మురళిరెడ్డి, శ్రీధర్, మంగతాయరు, రుక్మిణీదేవి తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని శ్రీలక్ష్మీగణపతి



వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయ వినాయకుడు

ఆంజనేయస్వామి ఆలయంలో...

చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన మండపంలో శ్రీవరసిద్ధి వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో ఆలయ చైర్మన్ దేవనాథం, అర్చకులు బుగ్గ లక్ష్మీపతి శర్మ, కందాళ వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.



లలితానగర్‌లోని శ్రీవిజయ గణపతి ఆలయ మండపంలో కళా నృత్య నికేతన్ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ విద్యార్థుల నాట్య ప్రదర్శన - ముషీరాబాద్

తాత్కాలిక తటాకాలు సిద్ధం

సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



చిలకలగూడ మైదానంలో ఏర్పాటు చేసిన రెడీమేడ్ పాండ్

చిలకలగూడ : చిలకలగూడ మున్సిపల్ మైదానంలో లక్షలాది రూపాయల వ్యయంతో గణనాథుని విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ప్రత్యేకంగా తాత్కాలిక తటాకాలను ఏర్పాటు చేశామని, ఈ సదుపాయాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ, పోలీస్ అధికారులు కోరారు. చిలకలగూడ, వారాసిగూడ, మైలార్‌గడ్డ, పద్మారావునగర్, మెట్టుగూడ, నామాలగుండు, పార్శిగుట్ట, బౌద్ధనగర్, సీతాఫల్‌మండి తదితర ప్రాంతాలతోపాటు ఇళ్లలో ప్రతిష్ఠించిన వేలాది వినాయక విగ్రహాలను చిలకలగూడ మైదానంలో నిమజ్జనం చేసేందుకు జీహెచ్ఎంసీ అధికారులు సుమారు 25లక్షల వ్యయంతో రెండు తాత్కాలిక తటాకాలు(పాండ్స్) ఏర్పాటు చేశారు. ఒకటి నుంచి మూడు అడుగుల ఎత్తుగల విగ్రహాలను రెడీమేడ్ ప్లాస్టిక్ పాండ్, నాలుగు నుంచి పది అడుగుల ఎత్తుగల విగ్రహాల కోసం 12 అడుగుల లోతు గల మరో పాండ్‌ను తవ్వి మంచినీటితో నింపారు. పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు క్రేన్, నిష్ణాతులైన సిబ్బందిని నియమించారు.